# స్త్రీ బుద్ధి....

రచన :
శ్రీ అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం.

చకచకా నడుస్తున్నాడు మురళీకృష్ణ. అది సంధ్యా సమయం. సూర్యుడస్తమించడానికి సిద్ధంగా నున్నాడు. అప్పుడే ఆఫీసు ఫైళ్ళలోంచి విముక్తుడై ఇంటిదారి పడ్తున్నాడతను. మురళీకృష్ణ అందమైన యువకుడు. పాతికేళ్ళుంటాయి. పొడవైన నాసిక, చెదిరి ముఖమండలము మీద పడే క్రాపు, చింపిరి కళ్ళు-అతనికొక ప్రత్యేకమైన సౌందర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇంటర్ పాసయి ఏదో ఆఫీసులో గుమాస్తా గిరి వెలగ బెట్టున్నాడు. నడుస్తున్నాడన్న మాటే గాని అతనికి ఉదయం మాలతికీ, తనకీ జరిగిన సంభాషణే కళ్ళ ముందు కనబడుతోంది.

× * ×

మేజోడు వేసుకొని బూటు తొడుక్కొంటున్న తనని 'ఏమండీ' అని గోముగా పిలిచింది-ఉదయం మాలతి.

'ఎందుకండీ' అన్నాడు-చిలిపిగా.

'ఇవాళ సినిమా కెళ్దామాండీ...?' అంది మాలతి తన షర్టు కాలరు సర్దుతూ.

'అబ్బే! నాకు టైము లేదండీ! రాణీగారు కావాలంటే వెళ్ళండి' అన్నాడు.

మాలతి బుంగమూతి పెట్టింది. 'పొండి! మీ రెప్పుడూ ఇంతే!'

'దేవిగారి నొదిలి ఎక్కడికి పోమ్మంటారండీ?' అడిగాడు తను.

'చాల్లెండి, వేళాకోలం! మీ కిష్టం లేక పోతే మానేయండి. కాని వ్యంగ్యంగా మాట్లాడొద్దు' కోపం వచ్చేసింది మాలతికి.

'అదుగో మాలతీ! నీకు కోపం వచ్చేసింది చూశేవా? నేనేదో హాస్యానికంటే నువ్వది సీరియస్ గా తీసుకొన్నావు' అన్నాడు.

మాలతి మౌనంగా ఊరుకుంది.

'సరే! రాణీగారి ఆజ్ఞ! తప్పుతుందా? సాయంకాలం 6 గంటల సరికి తయారుగా వుండు' అంటూ మాలతి బుగ్గమీద చిటిక వేసి బయల్దేరాడు తను.

'మర్చిపోరు కదండీ?' అంటూ వెనుక నుంచి ద్విగుణీకృతోత్సాహంతో కేకేసింది మాలతి...

పై సంఘటన మననం జేసుకుంటూ నడుస్తున్నాడు మురళీకృష్ణ. మాలతికి క్షణంలో కోపం వస్తుంది; అంతలోనే పోతుంది. మాలతిని తాను ప్రేమించి పెళ్ళాడాడు. అందుకే అపరిమితానురాగంతో ప్రేమిస్తాడు. మాలతిని చేపట్టడానికి తను పడ్డ బాధలు లెఖ్ఖ లేవు. మొదటిసారి కాలేజీలో ఆమెను చూసి వెంటాడడము మొదలెట్టాడు. అది ఒక అపరాధమని మాలతి తనని నానా మాటలు అని ప్రిన్సిపల్ గారికి రిపోర్టు చేస్తానంది. తను భయపడి ఆ పనిమాత్రం చేయొద్దని ప్రార్థించాడు. కాని మనస్సును ఆమెనుండి మరల్చుకోలేక పోయాడు. ఊరంతా బికారిలా తిరిగాడు. గెడ్డం, మీసం పెంచాడు. దుస్తులు ఎన్ని వారాలయినా మార్చ లేదు. చదువు మాటే మరచి పోయాడు.

మురళీకృష్ణయొక్క అవస్థంతా గమనించింది మాలతి. జాలి పడింది. తన మూలంగా అతని భవిష్యత్తు పాడవుతుందని భయపడింది. ఒకనాడు బీచ్‌లో మురళీకృష్ణను కలుసుకొని అతనిని ఓదార్చబోయింది. కాని వ్యథిత హృదయుడైన మురళీకృష్ణ మాలతి ప్రేమే లేకపోతే తను బాగుపడడం కల్లయని తేల్చి వేశాడు. మాలతి కరగిపోయింది. ఆ మర్నాటి నుండి మురళీకృష్ణ అవతారం మారిపోయింది, శుభ్రమైన దుస్తులతో మద్రాసంతా మాలతితో షికార్లు తిరిగాడు, కొన్నాళ్ళకు మాలతి తల్లిదండ్రులకు ఈ వార్త తెలిసింది. వెంటనే మాలతి, మురళీకృష్ణ కలుసుకోకుండా వుండేందు కనేక యాటంకాలు కల్పించారు. కాని ప్రేమికులు అపాయాలకు వెరుస్తారా? మాలతి తల్లిదండ్రులు కోపోద్రేకు లయ్యారు. ఇక లాభం లేదని మాలతి ఖరాఖండీగా తన యభీష్టం తలిదండ్రుల కెఱింగించింది. మురళీకృష్ణను పెండ్లాడకపోతే యావజ్జీవమూ బ్రహ్మచారిణిగా వుంటానంది. గత్యంతరం లేక పెద్దలందరూ మాలతీ మురళీకృష్ణలను ఏకం చేశారు...

పూర్వ గాథాలహరి స్మృతిపథంలోకి వచ్చి మురళీకృష్ణ తన్మయు డయ్యాడు. పూర్వ స్మృతిలో పడి ఇంటిని కూడా దాటేసి కొంత సేపటికి తెలుసుకొని వెనుదిరిగి ఇంటిని చేరాడు-మురళీకృష్ణ.

గుమ్మంవద్దే ఎదురొస్తుందనుకున్న మాలతి అసలు జాడే కనబడక పోయేసరికి నిశ్చేష్టు డయ్యాడు. తలుపులు తెరుచుకొని లోనికి నడచాడు. ఎక్కడా చడీ చప్పుడూ లేదు. తిన్నగా అతని గదివద్దకు వచ్చాడు. లోనికి రాబోయి తెల్లబోయాడు.

లోపల-మురళీకృష్ణ గదిలో వస్తువులన్నీ చిందరవందరగా ఇటూ అటూ పడివున్నాయి. ముఖ్యంగా మురళీకృష్ణ బుక్ షెల్ఫ లోని పుస్తకాలన్నీ ఇటూ అటూ నేల పడున్నాయి. మాలతి రౌద్రాకారంతో చేతిలోని ఒక ఫొటోను తదేకంగా పరికిస్తోంది. అడుగుల సవ్వడి విని తలెత్తి మురళీకృష్ణవంక కోపంగా చూసింది.

'ఇదంతా ఏమిటి మాలతీ?...' ఆశ్చర్యంతో ప్రశ్నించాడు మురళీకృష్ణ.

'ఏం! మీరు భద్రంగా ఇన్నాళ్లూ దాచుకొన్న ప్రియురాల్ని-అదే దాని ఫొటోని కనిపెట్టేశానని కోపమా?' వెటకారంగా ప్రశ్నించింది మాలతి.

మురళీకృష్ణ మాలతిని సమీపించి ఆమె చేతిలో నున్న ఫొటోను చూసి ముక్కుమీద వేలు వేసుకొన్నాడు. ''అయ్యో! అడదాని బుద్ధి పోనిచ్చావు కాదుకదా?...' అన్నాడు.

మాలతి మరింత కోపంతో ఊగిపోయింది. 'ఇంకా పైగా నామీదే ఎగురుతున్నారూ?...' అన్నది.

మురళీకృష్ణ ఇక వుండబట్టలేక పోయాడు. 'ఆపు మాలతీ! చాలించు నీ అధిక ప్రసంగం! ఆమె-ఆ ఫొటోలో నున్న యువతి ఎవరో తెలుసా? తెలిసేక ఎంత పశ్చాత్తాప పడతావో...'

'హుఁ! ఇంకా పశ్చాత్తాపం పడాలట! పశ్చాత్తాపం!!' మాలతి ఈసడించింది.

'మాలతీ!!' గట్టిగా అరిచాడు మురళీకృష్ణ. 'ఆమె...ఆమె...నా చెల్లెలు, సుగుణ, మాలతీ! నా చిట్టిచెల్లెలు. నా ప్రాణం! పాపం! మలేరియా వచ్చి చనిపోయింది. నా తల్లిదండ్రులు చనిపోయాక ఆమెను ప్రాణసమానంగా సాకాను. ఎంత తెలివైనదని! దాన్ని చూసుకొంటూ జీవితంలో మరే బాధలు లేవనుకునే వాణ్ని. అది అకస్మాత్తుగా మరణించడంతో నా హృదయం ప్రక్కలయింది. ఆ రోజు నేనెంత విలపించానో నీకేం తెల్సు? ఆనాటినుండి నాకు జీవితంమీదే విరక్తి గలిగింది. కాని...నీ సహచర్యంలో కొద్దిగా ఆ బాధను మరిచిపోగలిగాను. కాని నేడు తిరిగి నువ్వు నా మానిన గాయాన్ని రేపావు''.

'పాపం! చంద్రం, ఎంత దురదృష్టవంతుడు? సుగుణ చనిపోవడంతో విరక్తి చెంది బికారయి దేశాలు పట్టిపోయాడు. ఇంకానమ్మకంలే, ఇదిగో నాకతడు రాసిన ఉత్తరం!, అంటూ మురళీకృష్ణ తన పెట్టె నుండి ఒక కవరు తీసి దానిలోని కాగితాన్ని ఆమెకిచ్చాడు. అందులో—

'మురళీ,

ఎలా వ్రాయను? ప్రప్రథమ చూపులోనే నీ సుగుణని ప్రేమించాను. ఆమె వయోరూపగుణ లావణ్యాలు నన్నాకర్షించాయి. మా వాళ్ళు సులువుగానే ఒప్పుకొన్నారు. ఇక నువ్వుకూడా అంగీకరిస్తే మేమిద్దరమూ ఒకటవుతాము.

జవాబు వ్రాయి.

''చంద్రం''

అని వుంది. మాలతి దాన్ని చదివి కంటివెంట జలజలా అశ్రువులు రాలుస్తూ, 'నేనెంత పాపిష్టినండీ! మీ స్వంత చెల్లెలని కూడా అనుమానించాను. నాకు విముక్తి లేదండీ!' అంటూ మురళీకృష్ణ పాదాలపై పడింది.

మురళీకృష్ణ ఆమెను పైకి లేవనెత్తి, కన్నీటిని తుడిచి, 'విచారించకు, మాలతీ! నీకు ఈ విషయం మొదట్లోనే చెప్పక పోవడము నాదే తప్పు! ఏది ఏమైనా నువ్వుమాత్రం 'స్త్రీబుద్ధిని పోనిచ్చావు కాదు' అంటూ ఆమెను గాఢంగా కౌగిలించుకున్నాడు.

*


కథాంజలి

[కథల మాసపత్రిక]

స్థాపితము 1938.

విడి ప్రతి, — 25 పై.

సంవత్సర చందా, — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గింబాతమ్స్, స్వదేశమిత్రన్)

బుక్‌స్టాల్స్‌లులోనూ దొరుకును.